# 10. ధన్వంతరి

డాక్టర్ గిరి గారి ఏకైక పుత్రుడు చనిపొయ్యాడనే వార్త తెలియగానే స్నేహితుణ్ని చూసేందుకు ప్రయాణమయ్యాను. డాక్టరూ, నేనూ కలిసి చదువుకున్నాం. ఆ చిన్ననాటి స్నేహం మాట అటుంచి ఒకప్పుడు నాకు ప్రాణం మీదికి వొస్తే తన బుద్ధిబలంతో అతి చాకచక్యంగా నాకు చికిత్స చేసి నన్ను మృత్యుముఖం నుంచి కాపాడాడు. ఆ ప్రాణదాతను నేను జన్మలో మరిచిపోగలనా?

గిరి చాలా విచారకరంగా, విషాదకరంగా వున్నాడు. ఏడ్పు ఒక్కటే తక్కువగా అతనిలో మిగతా వ్యధనంతట్నీ చూడగలిగాను. ఐదారు రోజుల్నుంచీ రోగులు పడి వున్నారు. దూర దేశాల నుంచి డాక్టర్ ప్రతిభను విని వొచ్చిన రోగులు డాక్టర్ దర్శనం కోసం తహతహలాడుతున్నారు. కాని డాక్టర్ అటువైపే వెళ్ళటంలేదట. తను ప్రాక్టీసు మానుకున్నాననీ, ఇంకో డాక్టర్ దగ్గరికి వెళ్ళమనీ చెప్పాడు. కాంపౌండర్లను కూడా మానుకోమని చెప్పాట్ట. కుమారుడి మరణం అతనికి భరించరానంతయిందని అర్థం చేసుకున్నాను.

చాలా అలసిపోయి వున్నాడు. అమితంగా విచారించటం వల్ల అతని ముఖంలో అనారోగ్య చిహ్నాలు స్పష్టంగా కనిపిస్తున్నయ్. చాలాసేపు ఓదార్చుతూ మాట్లాడాను. అంతా విని నవ్వాడు. "నేను కొడుకును పోగొట్టు కున్నందుకే యింతగా విచారించటంలేదు. మృత్యువును యే మానవుడు జయించగలిగాడూ? ఎన్నో చావుల్నీ, యమబాధల్నీ చూశాను. ఆ ఏక పుత్ర వియోగంతోనే నేను ఇంతగా కుంగిపోలేదు" అన్నాడు.

"మరి? అన్నాను ఆశ్చర్యంతో.

కాస్సేపు బాధగా, బరువుగా ఆలోచిస్తూ వూరుకున్నాడు.

"శాస్త్రం అనేదాన్ని నమ్మి పదిహేను సంవత్సరాల్నుంచి వృత్తిగా చేస్తూ, ఆరాధిస్తున్నాను. అపజయం అనేది వుండొచ్చు; కాని దానికి కారణం తెలుస్తూంటుంది..."

"అంటే?" అన్నాను అర్థంగాక.

"ఒక జబ్బును ఇంకో జబ్బుగా గుర్తించి, చికిత్స మొదలు పెడతామనుకో, కొంత దూరం పొయ్యాక నన్నా మన పొరపాటు తెలుస్తుంది. చివరకు రోగి చనిపొయ్యాకన్నా ఆ పొరపాటు అర్థమౌతుంది..."

"నిజమే. కాని శాస్త్రవేత్తలు మందులు పొయ్యగలవాళ్ళే కాని ఆయుస్సును కాదుగా!"

"ఆయుస్సు సంగతి నాకు అక్కర్లేదు కాని శాస్త్ర ప్రకారం నాకు ఫలితాలు కనిపించాలి. రోగి చావు బతుకులకు శాస్త్రం జవాబుదారీ కాకపోవచ్చు. లోకంలోని గొప్ప బుర్రలన్నీ కలిసి కనిపెట్టిన శాస్త్ర ఫలితాన్ని చూడ గలుగుతున్నాం. అదే తప్పయిననాడు ఇక శాస్త్ర మేమిటీ? నా కొడుకు విషయంలో ఇది ఎందుకు తల్లకిందులైందో అమిత గాఢంగా ఆలోచిస్తున్నాను. నాకేమీ అంతుపట్టటంలేదు."

కుర్రాడు యే జబ్బుతో ఎలా మరణించాడో, ఆ వివరాలన్నీ నాకు అర్థంకాక, "కొంచెం విపులంగా చెప్పు" అన్నాను.

"అదో కొత్తరకం జ్వరం. ఉన్నట్టుండి నూట ఆరు డిగ్రీల ఉష్ణం వొచ్చేస్తుంది. ఎన్ని చేసినా ఉష్ణం తగ్గదు. చివరిదాకా నాడి, గుండె సరైన స్థితిలోనే వుంటయ్. ఒక వారం రోజుల్లో అటో యిటో తేల్చేస్తుంది. రోగి మాత్రం మగతగా పడి వుంటాడు. అప్పుడప్పుడు తెలివి కూడా వొస్తూంటుంది. ఇలాటి జ్వరాల్ని గూర్చి చదివాను కాని యెన్నడూ చికిత్స చేసి యెరుగను--"

"కొత్తరకం జబ్బు కావటం వల్ల..."

నా మాట పూర్తికాకుండానే డాక్టర్ అన్నాడు: "సరే... అంతా విను మరి: మావాడిది మొదటి కేస్ కాదు. వీడికి రాకపూర్వం మూడు రోజుల ముందునుంచీ ఇంకో కుర్రాడు కూడా ఇదే రకం జ్వరంతో బాధపడుతున్నాడు. వాళ్ళు లక్షాధికార్లు. వాళ్ళకూ ఒక్కడే కొడుకు. మనవాడి వయస్సే. పదేళ్ళు. వాడికి నేనే చికిత్స ప్రారంభించాను. జబ్బును గుర్తించటంలో పొరపాటు పడలేదు. చికిత్స విషయంలో కూడా యేమీ పొరబడలేదు. రాత్రు లంతా మేలుకొని అనేక పుస్తకాల్ని చదువుతూ జాగర్తగా అంతా అర్థంచేసుకుంటూ వొచ్చాను. మూడు రోజులకు మా కుర్రాడిక్కూడా అదే జ్వరం ఆరంభమైంది. అతి మెలకువతో, అతి జాగర్తగా చికిత్స మొదలుపెట్టాను.

ఐస్ వేసినా, వుడుకులాం వేసినా ఏం చేసినా సరే ఒక్క డిగ్రీ ఉష్ణం కూడా దిగిరాదు. పోతే యింత ఆహారం ద్రవ రూపంలో వెళ్తుంది– అదీ రోగి కాస్త తెలివిగా వున్నప్పుడు. లేకుంటే ఆహారం కూడా ఇంజక్షన్ రూపంలో పోవాల్సిందే! ఇలా మొదటి రోగికి ఆరు రోజులు గడిచినయ్. యేమీ నయం కాలేదు. రోజు రోజుకూ దిగజారుతున్నాడు. తల్లి దండ్రుల గాభరా చూసి నాకూ కొంచెం అధైర్యం యేర్పడ్డది. వాళ్ళు రెండు వేల రూపాయిల ఫీజు కూడా ఆశపెట్టారు.”

ఆనాడు జరిగిన విషయాన్ని తలపుకు తెచ్చుకుంటూన్నవాడిలాగు కాస్సేపు తలవాల్చి, మళ్ళీ ప్రారంభించాడు:

“నా శక్తికొద్దీ ఆలోచించాను. రోజుకు రెండు మూడు సార్లు రోగిని పరీక్షించేవాణ్ణి. ఇక మా వాడి విషయం– మొదటి రోగికన్న వీడు అన్ని విధాల నయం. అదీకాక నాకు అనుమానంగా వున్న ఫలితాల్ని, మొదటి రోగి మీద ముందు ఎక్స్‌పరిమెంట్ చేసి, తరువాత మా వాడిమీద వుపయోగించుకుంటూ వచ్చాను. ఏడోనాడు మొదటి రోగి మీద ఆశలన్నీ పోయినయ్. నేను చదివిన చికిత్స ప్రకారం యింక వొక్కటే దారి వుంది. రోగిని పడుకోపెట్టి ఇరవై ముప్పై బిందెల చన్నీళ్ళను ఒక గంటసేపు చల్లటం. ఈ చికిత్స విషయంలో నాకేమీ నమ్మకం లేదు. చివరకు రోగి తల్లి దండ్రులన్నా ఇందుకు అంగీకరిస్తారో లేదో అనుమానం వేసి అడిగాను. వాళ్ళకు నా మీద వున్న గురితో కానీ, కొడుకుమీది ఆదుర్దాతో కానీ– వెంటనే ఒప్పుకున్నారు. ఎక్స్‌పరిమెంటుకు నిండు ప్రాణాన్ని యిచ్చేవాడే దొరకాలి కాని శాస్త్రకారుడికి దాని విలువతో యేం పనీ? నీళ్ళు చల్లించాను గంటసేపు. రోగిని తుడిచి పడుకోబెట్టాను. రోగిలో మగత లేదు, శరీరం దాదాపు నార్మల్‌లో వుంది. చాలా తెలివిగా ఆహారం కావాలని అడిగాడు. నాకు యెక్కడలేని ధైర్యమూ వొచ్చింది. అంతే ఆ మర్నాటినుంచే వాడు మామూలు కుర్రాడయ్యాడు–”

“ఇప్పుడు నీ ఆలోచన దేన్ని గూర్చి?” అన్నాను.

“అదే జబ్బు, అంతకన్న తక్కువ హానికరంగా వున్నది, అలాటి చికిత్సే చేశాను. మొదటి రోగితో సంపాయించిన విజ్ఞానాన్నంతటినీ వుపయోగించుకున్నాను. నా కొడుక్కు నేనెంత గొప్ప చికిత్స చేసి వుంటానో ఆలోచించు. మొదటి రోగిలాగే– నీళ్ళు చల్లటం అంతా ఐంది– తుడిచి పడుకో బెట్టాను. నాడి ఆగిపోయింది. అమృతం అంటూ వుండి దొరుకుతేతప్ప యింక లాభంలేని పరిస్థితి యేర్పడ్డది. రోగం శాస్త్ర విజ్ఞానానికి అతీతమైంది. మొదటిసారే నా కొడుకుమీద నీళ్ళు చల్లాల్సి వొస్తే నేను ధైర్యం చేసేవాణ్ణి మాత్రం కాదు. అక్కడ వాడు ఎందుకు బతికాడూ? వీడు ఎందుకు చచ్చాడూ? అసలు యీ శాస్త్రానికి ఒక దారి అంటూ వుందా అని ఆలోచిస్తున్నాను––”

“ఉండకపోతే యెట్లా?” అన్నాను.

"అదే నేనూ ఆలోచించేది. ఇద్దరు రోగులూ చచ్చినా నాకు పేచీ లేదు, ఇద్దరూ బతికినా శాస్త్రాన్ని నమ్మేవాణ్ని. ఇప్పుడు ఎటూ కాలేదు..."

"అమలు జరపడంలో పొరపడొచ్చు--"

"పోనీ ఆ పొరపాటన్నా తెలియటంలేదు. అది తెలియకపొయ్యాక ఇంక యీ శాస్త్రాన్ని నమ్మటం అంత బుద్ధితక్కువ పని యింకొకటి లేదు. అంతవరకూ నేను ప్రాక్టీసు చెయ్యను--"

"దానికీ దీనికీ సంబంధం యేమిటీ?"

"లేకపోతే యేమిటీ? శాస్త్రం అంటే యిదేనా? గణిత శాస్త్రం చూడు నాలుగు నాలుగులు పదహారు. నీకైనా అంతే నాకైనా అంతే. ఎక్కడైనా, ఎప్పుడైనా ఒక్కటే! ఇది అట్లా కాదు. నీకో రకమూ, ఇంకోడికో రకమూనా! ప్రతి మనిషి ప్రాణంమీదా ఒక యెక్స్‌పరిమెంటా? వాళ్ళ జీవాల మీదనేనా మన విజ్ఞాన పరామర్శ? వెధవ డబ్బుకోసం యీ పాడు పనులు--"

"అట్లా అనవోక, నువ్వు చేసిన ప్రాణదానాలు మాత్రం లేవూ? ఒక సారి నన్నే బతికించావ్--"

"ఆ మాటను కనీసం నాకు నేనే నమ్మలేకుండా వున్నాను. శాస్త్రం తప్పో, రైటో తెలియదు. ఒకే చికిత్సను ఒకే జబ్బుకు చేసేందుకు వీల్లేదు. ఇక మన తెలివితేటలు ఎందుకూ!"

"అది మీ వాడి తత్వానికి పడకపోవచ్చు-"

"మనిషికో తత్త్వమైతే మనిషికో శాస్త్రం కూడా కావాలి. అంతేకాని మనుష్య ప్రాణాన్ని గూర్చిన ఒకే శాస్త్రం పనికిరాదన్న మాట. మరి అది శాస్త్రమనేందుకే వీల్లేనప్పుడు నేను శాస్త్రకారుణ్ణే కాదు. నేను చేస్తే మాత్రం యెవ్వరైనా చెయ్యగలరు. అందుకని నేను మానుకుంటాను"

నాకు జవాబు దొరకలేదు.

"వాళ్ళ బిడ్డ బతికాడని రెండువేల రూపాయిల ఫీజు పంపారు. నా విజ్ఞానం డబ్బు సంపాయించింది కాని ప్రాణాన్ని మాత్రం కాదు. మా వాడి ప్రాణాన్ని ఎవరు ఇవ్వగలిగారూ?"

"ఎవరు ఇవ్వగలరూ? లోకంలో కారణం చెప్పలేనిది ఒక్కటే. మృత్యువు."

"ఆ మృత్యువును జయించే శాస్త్రమంటూ లేదన్నమాట, అందుకని అలాటి శాస్త్రాన్ని ఆరాధించటంలో అర్థం లేదు--"

ఆనాటినుంచీ గిరి ప్రాక్టీసు మానుకున్నాడు.

– అక్టోబరు, *1945*